ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
బుధవారం | 03 జులై, 2024 | పేజీలు : 05

# నిధులు లేక పంచాయతీ కార్యదర్శుల ఇక్కట్లు..

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** సర్పంచుల పదవీ కాలం ముగిసి ఆరు మాసాలు గడుస్తున్న స్పెషల్ ఆఫీసర్ల పాలనలోనే గ్రామ పంచాయతీల పరిపాలన నడుస్తుండడంతో గ్రామపంచాయతీల పరిపాలన కార్యదర్శులకు భారమైంది. పంచాయతీలకు రావాల్సిన నిధులు నెలల తరబడి రాకపోవడంతో అప్పులు చేసి గ్రామపంచాయతీలను కార్యదర్శులు నడుపుతున్నారు. తమ జీతాలను సైతం పంచాయతీల పరిపాలనకే ఖర్చు చేయాల్సి వస్తుందని, దీంతో కుటుంబ భారం తలనొప్పిగా మారిందని కార్యదర్శులు లబోదిబోమంటున్నారు. గ్రామాల్లో శానిటేషన్, ఇతర పనులు సిబ్బంది జీతాలకు అప్పులు చేసి చెల్లించే పరిస్థితి తలెత్తిందని, సరైన సమయానికి బిల్లులు రాకపోవడంతో అప్పులు తీర్చాలంటూ తమ ఇళ్లలోకి వస్తున్నారని, తమకు ఇంతటి దౌర్భగ్య పరిస్థితి ఏంటని కార్యదర్శులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒకటి రెండు గ్రామాల్లో జీతాలు చెల్లించకపోవడంతో పారిశుధ్య కార్మికులు విధుల్లోకి రాని సందర్భాలు కూ డా మండలంలో ఉన్నాయంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. మరి కొన్ని గ్రామాలలో గత ప్రభుత్వ హాయంలో నూతన భవనాల ని ర్మాణానికి పాత భవనాలు కూల్చి వేసి శంఖుస్థాపన చేసి వదిలేయడంతో అవి ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో గ్రామపంచా యతీలు ఏర్పాటు చేసి పరిపాలన చే స్తుండడంతో కార్యదర్శులు ఇబ్బందికర పరిస్థితుల మధ్య విధులను నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పం దించి పంచాయతీల పరిపాలన సౌలభ్యానికి నిధులను మంజూరు చేసి గ్రామాలను అభివృద్ధిదిశగా పయనింపజేసేలాచూడాలనిప్రజలు కోరుతున్నారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ

# ప్రజలకు సేవలు అందించాలి

### జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వి.రాం చందర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** జిల్లాలో ప్రభుత్వ అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పారదర్శకంగా ప్రజలకు సేవలను అందించాలనీ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. మంగళవారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వి.రాంచందర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియం హాల్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహజన్, జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమార్ బాబు, రిసర్చ్ అధికారి డి.వరప్రసాద్ లతో కలిసి జిల్లా అధికారులతో రివ్యూ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను జిల్లా కలెక్టర్ సాదరంగా

తరువాయి 2లో

## కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు

# పకడ్బందీగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మత్తులు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కడెం ప్రాజెక్టును ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆమె సందర్శించి,ప్రస్తుత ప్రాజెక్టు నీటిమట్టం,ఇన్ ఫ్లో,జరుగుతున్న గేట్ల మరమ్మతుల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,ప్రాజెక్టు గేట్ల మరమ్మత్తులు,ఇతర పనులను వెంతనే పూర్తి చేయాలని సూచించారు.ఇప్పటికే వర్షాకాలం ప్రారంభం అయినా నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రాజెక్టు ఆపరేషన్ సిస్టంను పర్యవేక్షించాలని అన్నారు.ప్రతిరోజు ప్రాజెక్టు సీటిమట్టం,ఇన్ ఫ్లో పరిశీలించాలని, అత్యాధునిక ప్రమాద హెచ్చరికల వ్యవస్థ ఉన్నందున నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు సమాచారాన్ని సమీప గ్రామాల ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేయాలనీ అధికారులకు సూచించారు.చేపట్టిన పనులు,నిర్వహణ తదితర అంశాలపై ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకల్యాణి,నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్,ఎస్.ఈ రవీందర్,ఈ.ఈ.విఠల్, తహసీల్దార్ సుజాత ఎంపీడివో అరుణ,అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూడ గూడు కోసం టౌన్ మెట్లు ఎక్కిన

# వృద్ధ దంపతులు

### అందరూ ఉన్న అనాధల బ్రతుకుతున్న వైనం

### నాలుగు నెలలుగా కలెక్టర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్లో చుట్టూ ప్రదక్షిణలు

### చెట్టుకిందె గత నాలుగు నెలలుగా వారి జీవనం



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** కోటి ఆశలతో కొడుకులను కానీ మురిసిపోయి పెంచి పెద్ద చేస్తే ఇప్పుడు వారు కానని పరిస్థితి ఏర్పడింది ఓ వృద్ధ జంటకు. కడుపు కట్టుకొని కన్న పిల్లల కోసం పైసా పైసా కూడబెట్టుకొని భూమి జాగలు సంపాదించి పెడితే కన్నవారిని కూడా చూడకుండా ఇంటి నుండి బయటకు గెంటేసారు. ఓ కర్కష కొడుకు. ఎండ కొడితే చెట్టు నీడలో, వానొస్తే తెలిసిన వారి ఇంటిలో తల దాచుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే సుల్తానాబాద్

తరువాయి 2లో

# కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి



### జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్:** రాబోవు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని సింగరేణి కాలనీలోని పరిసర ప్రాంతాల పరిశుభ్రత కొరకు సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి అన్నారు. మేరకు మంగళ వారం సివిల్ విభాగ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ ఉద్యోగులు కాలనీలలో ఎటువంటి చెత్తాచెదారం ఉంచకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే కాలనీవాసుల కోసం శుద్ధమైన మంచి నీటిని పంపిణీ చేయాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య పరిరక్షణ కోసం సివిల్ విభాగ అధికారులు, నిరంతరం పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం గోపాల్ సింగ్, డిజిఎం పర్సనల్ పి అరవిందరావు, ఇంచార్జ్ సివిల్ డిజిఎం రాము, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, గట్టయ్య, డాక్టర్ లోకనాథ్ రెడ్డి, సివిల్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# డయాలసిస్ సెంటర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎండి.సంయుద్దీన్ మంగళవారం ధర్మపురి పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్ లో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధర్మపురిలో ఉన్న డయాలసిస్ కేంద్రం ద్వారా గత ఏడాది 177 మంది పేషంట్లకు అవసరమైన వైద్య సేవలు అందించడం జరిగిందని గత నెలలో 17 మంది కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేసినట్లుగా డీఎం అండ్ హెచ్ఓ సంయుద్దీన్ తెలిపారు.ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం మండలాల పరిధిలోని కిడ్నీ సంబంధిత బాధితులు ధర్మపురి లోని కేంద్రం ద్వారా అందిస్తున్న డయాలసిస్ సేవల్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, ఈఓ ఎనుగంటి రాజేశం,సతీష్ కుమార్ ఉన్నారు.

# నీతి అయోగ్‌లో చేపట్టిన పనుల వివరాలను సమర్పించాలి

2లో

జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారిజిల్లా
అదనపు కలెక్టర్ దీపక్ తివారి



## పెద్దపల్లి జిల్లాలో మట్టి కొల్లగొట్టి నిబంధనలు ఉల్లంఘించిన

# మట్టి మాఫీయాపై చర్యలు ఏవి?

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:**పెద్దపల్లి జిల్లాలో నిబంధనలు కాలరాస్తున్న మట్టి మాఫియాకు సంబంధించిన అధికార యంత్రాంగం మొత్తం అండగా నిల్చిందని అందరు కలిసి సహజవనరలను దోచుకొని అర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించుకొని ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని గండి కొట్టారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ పేర్కొన్నారు.అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ రామగుండం మండలం మూర్మూర్ గ్రామంలో ప్రక్కన అన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు క్రింద ఉన్న ప్రాజెక్ట్ మట్టి తీసుకునే అనుమతి లేనప్పటికీ నిబంధనలకు విరుద్ధంగ అధికారులతో లోపాయికారి ఒప్పందంతో ఇటుకబట్టి యాజమాన్యాలతో మట్టి మాఫీయాలతో అధికార యంత్రాంగం కుమ్మక్కై కొంత మెరకు రాయల్టీ కట్టి కొండంత మట్టి థవ్వకొని మట్టిని దోచుకున్నారని మట్టి మాఫీయా చేసిన వారి పై పీడి యాక్ట్ అమలు చేయాలని అదే విధంగా వారికి సహకరించిన అధికారాలను సస్పెండ్ చేయాలని అన్నారు. ఒక్క మీటర్ లోపు మాత్రమే అనుమతులు ఇస్తారని కా ని 5 నుండి 6 మీటర్ల లోపు తవ్వుకోని పోయారని నల్ల మట్టి నీళ్లను ఇనుకనివ్వదని అంత లోతు తీసి మిషిన్ మునిగెంత వరకు లోపలికి దించి తవ్వరని అందినకాడికి దండుకపోయి కాసుల వర్షం కురిపించుకున్నారని, 60 వేల మెట్రిక్ టన్నులు అనుమతులు తీసుకుంటే 1,80,000 మెట్రిక్ టన్నుల మట్టి తీసిన మట్టి మాఫీయా, వివిధ ఇటుక బట్టిల యాజమాన్యాలకు తరలించారని ,అనుమతులు తీసుకుంటే సంబంధించిన శాఖఅధికారులు పర్యవేక్షణ ఉంటుంది కానీ ఇ క్కడ మట్టి మాఫీయా దే పై చేయి అయిందనిమైనింగ్ యాక్ట్ ప్రకారం ఉదయం 8 గంటల నుండి సా యంత్రం వరకు మాత్రమే అనుమతులు ఉంటాయి కా నీ ఇక్కడ నిరంతర ప్రక్రియగా 24 గంటలు మట్టిని తీ సారని ఇరిగేషన్, మైనింగ్, అధికారులకు మరియు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందనీ,కేవలం ఈ మట్టి ద్వారా 12 లక్షల రాయల్టీని కట్టి నాలుగు కో ట్ల 50 లక్షల వరకు ఎక్సెస్ చేశారని అన్నారు. నూతన జిల్లా కలెక్టర్ మరియు మైనింగ్ ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు స్పందించి (ఈటిఎస్) ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్ ప్రజల సమక్షంలో సర్వే చేయించి లోతుగా తీసిన మట్టిలో యుద్ధ ప్రాతిపదికన మట్టిని నింపాలని ప్రకృతి సంపదను కాపాడాలని చెరువుల అస్తిత్వాన్ని కాపాడాలని, అలాగే పెద్దపల్లి జిల్లాలోని బండ్ల వాగు తక్కలపల్లి, అల్లూరు, బిట్టుపల్లిలో ఇదే తంతుగా పరిమితి మించి జరగుతున్న పట్టించుకునే అధికారులు జిల్లాలో కనపడటం లేదని విజిలెన్స్ విచారణ జరిగిందని సమాచారం ఉందని, కావున అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని సహజ వనరులను దోచుకుంటున్న మట్టి మాఫీయా పై మరియు ఇటుక బట్టుల యాజమాన్యాల పై పీ డి యాక్ట్ అమలు చేయాలని, వారికి సహకరిస్తున్న కొంతమంది సంబంధించిన మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, అవినితి అధికారల పై సమగ్ర విచారణ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టించే విధంగా ప్రయత్నం చేసిన వారిని సస్పెండ్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గారిని కోరమని మద్దెల దినేష్ అన్నారు.



## దివంగత మాజీ మంత్రి రామారావ్ సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ ఇచ్చోడ :** దివంగత మాజీ మంత్రివర్యులు గోడం రామారావ్ చేసిన సేవలు చిరస్మరణీయమని స్థానిక బీజేపీ నాయ కులు కొనియాడారు. మండల కేంద్రమైన ఇచ్చోడలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని రామారావ్ విగ్రహం వద్ద జయంతి వేడు కలను మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో గిరిజన శాఖమంత్రి హోదాలో ఆదివాసీల అభ్యున్నతితో పాటు నియోజక వర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని వారు పేర్కొన్నారు. ఐటీడీ ఏను విస్తరించి వేలాది మంది గిరజన కుటుంబాల్లో వెలుగులు నింపా రని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తాంసీ జడ్పీటీసీ తాటిపల్లి రాజు, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి, నాయకులు కదం ప్రశాంత్, కృష్ణ కుమార్, గంగాధర్, నానం రమణ, అల్క గణేశ్, రాజేశ్వర్ రెడ్డి, ఆప్క కిషన్, జీవీ రమణ, ఆమ్టె, కదం బాబారావ్, కేశవ్, తులసీ కార్యకర్తలుపాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

**ప్రజాపక్షం/ ఇచ్చోడ :** దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వారంలో ఒక రోజు (శుక్రవారం) డ్రై డే పాటించాలనీ స్థానిక వైద్యాధికారి ఆకుదారి సాగర్ పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలపై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం వైద్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. ఇంటి చుట్టు మురుగు నీరు నిల్వ ఉండకుండా, పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా గ్రామీణ ప్రాంత మహిళలకు అవగాహన కల్పించాలనీ ఆయన సూచించారు. వ్యక్తిగత శుభ్రతతోనే అంటూ రోగాలు, వ్యాధులను దూరం చేయవచ్చునని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు నెలల పాటు ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీరును తాగితే సగం రోగాలు నయమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాజుబాయి, ఏఎన్ఎంలు, ఆశ వర్క ర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వహిసూ ప్రజలకు సేవలు అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

స్వాగతించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను, విద్య, వైద్యం, రుణాలు, సంక్షేమ, అభివృద్ధి, రంగంలో ఎస్సీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా అధికారులు శాఖల వారీగా తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. రెవెన్యూ శాఖ, విద్యా శాఖ, పంచాయతీరాజ్ శాఖ పరిశ్రమలు, ఎస్సీ సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఈడి ఎస్సి కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాల ప్రగతిని అధికారులు వివరించారు. ప్రతి ఒక్క అధికారి క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయాలని మన విధి నిర్వహణలో క్రమశిక్షణ చాలా కీలకమని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి శాఖల వారీగా పథకాల అమలు కట్టుదిట్టంగా నిర్వహించాలని అర్హులను మాత్రమే ఎంపిక చేసి వారికి లబ్ధి చేకూరేలా చూడాలని, ప్రభుత్వ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ను కట్టుదిట్టంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాత్రికేయులతో జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యులు వి.రాం చందర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఎస్సీలకు రావాల్సిన హక్కులు వారికి అందుతున్నాయా లేదా పరిశీలించి సకాలంలో అందించాలని అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు. ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్ ల్యాండ్స్ పట్టాలు అందించే అవకాశం పై రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశామని, విదేశీ విద్య పథకం, గురుకుల పాఠశాలలో ఎస్సి విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాల, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పై రివ్యూ చేసామని తెలిపారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో సకాలంలో పరిష్కరించాలని, వీటిపై పార్లమెంట్ 2018 లో 18 ఏ సెక్షన్ కింద ఎస్సీలు అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్తులను అరెస్టు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ డి ఎస్ సి కార్పొరేషన్ వినోద్ సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు రమేష్ రాజేశ్వర్ తహసిల్దార్లు జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 3న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్ర రాక

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** ఈ నెల 3వ తారీకునా స్థానిక పెద్దపల్లి లోని ఐ బీ గేస్ట్ హౌస్‌లో జాతీయ ఎస్ సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ వస్తున్నారని, వారికి వివిధ కుల సంఘాల నాయకుల తో సన్మాన కార్యక్రమం ఉన్నందున మధ్యాహ్నం 2గంటలకు, దళిత సంఘాల నాయకులు తప్పక హాజరు కావాలని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బొంకురి కైలాసం తెలిపారు.

## 15లోపు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం /పెద్దపల్లి రూరల్ :** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, 202425 విద్యా సంవత్సరానికి సంబంధించి అందించనున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జూలై 15 లోగా ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలోని సమస్త యాజమాన్యములలోని ప్రధానోపాద్యాయులు/ఉపాధ్యాయులకు 202425 విద్యా సంవత్సరమునకు గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందుటకు గాను జూలై 15 లోపు ఆన్ లైన్ http:// nationalawardstoteachers.education.gov.in అనే వెబ్ సైట్ లో నమోదు చేసుకోని అట్టి (2) ప్రతిపాదనలను సంబంధిత ధృవపత్రాలతో జిల్లా విద్య శాఖాధికారి కార్యాలయం, పెద్దపల్లిలో సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నీతి అయోగ్‌లో చేపట్టిన పనుల వివరాలను సమర్పించాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** జిల్లాలో నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను సాధించడం కోసం సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలు సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా వైద్య ఆరోగ్య, విద్య, పంచాయతీ, పశు వైద్య, గిరిజన అభివృద్ధి, సంక్షేమ, వ్యవసాయ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ క్రింద జిల్లాలో సంబంధిత శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ కార్యక్రమాల కింద జి ల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల సంబంధిత పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని తెలిపారు. ఏప్రిల్ 1 నుండి జూన్ 30వ తేదీ వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక అందించాలని, విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి, ఆర్థిక చేకూర్పు 5 విభాగాలలో 39 అంశాలపై నిర్ణీత నమూనాలు సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి అందించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా గిరిజన అభివృద్ధి అ ధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పశు వైద్యాధికారి సురేష్, ఎపి.డి.రామకృష్ణ, నీతి అయోగ్ జిల్లా స మన్వయకర్త మణివేలు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ క్విజ్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం

**ప్రజాపక్షం /రామగిరి :** ప్రపంచ పర్యావరణదినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల జీ.ఎం. కార్యాలయాల ఉద్యోగులకు గత నెల 8వ తేదీన పర్యావరణ పరిరక్షణ అంశంపై నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు మంగళవారం జి.ఎం. కార్యాలయ ప్రాంగణంలో బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆర్.జీ3 ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.సుధాకరరావు, ఏ.పీ.ఏ. జనరల్ మేనేజర్ కె.వెంకటేశ్వర్లు విజేతలకు బహుమతి ప్రధానం చేసారు.తదుపరి ప్లాస్టిక్ బ్యాగుల వాడకం తగ్గించాలన్న ఉద్దేశ్యంతో అవగాహన కల్పించడం కోసం కొంత మంది ఉద్యోగులకు జూట్ బ్యాగులను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలనీ, దీనిపై మన తోటి వారికి అవగాహన కల్పించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి బ్రాంచ్ సెక్రటరీఎం.రామచంద్రరెడ్డి, ఐఎన్టియూసి ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్.వెంకటరమణ, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర బాబు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి తోపాటు వివిధ విభాగధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కూడు గూడు కోసం టౌన్ మెట్లు ఎక్కిన వృద్ధ దంపతులు

(మొదటి పేజీ తరువాయి)

మండలంలోని కదంబాపూర్ గ్రామంలో ఓ వృద్ధ జంట అందరు ఉన్న అనాథల బ్రతుకుతున్నారు. గ్రామానికి చెందిన గోస్కుల కొమరమ్మ ఐలయ్య దంపతులకు నలుగురు సంతానం ఇద్దరు కొడుకులు ఇద్దరు కూతుర్లు ఉండగా కొడుకులు పెద్ద కొడుకు ఓదెలు, చిన్న కొడుకు రవి లకు ఐలయ్య సంపాదించిన భూమిని చేరి నాలుగు ఎకరాలు పంచి ఇచ్చాడు.చిన్న కొడుకు రవి తల్లిదండ్రులను సాకుతానని చెప్పి అదనంగా మూడు లక్షల రూపాయలుతీసుకున్నాడు.తన తల్లిదండ్రులను తన ఇంట్లో ఉండనిచ్చినందుకుగానులక్ష రూపాయలు వెలకట్టాడు. గత నాలుగు నెలలుగా రవి తల్లిదండ్రులను ఇంట్లో ఉండనివ్వకుండా ఇల్లుకు తాళం వేసుకొని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడనిఐలయ్య కొమరమ్మ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న కొడుకు రవి తన తల్లి కొమరమ్మకు పెన్షన్ ఇప్పిస్తానని చెప్పి మోసం చేసి సంతకాలు చేయించుకొని తన తల్లి పేరు మీద ఉన్న ఎకరం ఉన్నారా పట్ట భూమిని తన పేరున రిజిస్టర్ చేయించుకొని మోసం చేశారు. అయిన వాళ్ళు అందరూ ఉండి కూడుగూడుకు నోచుకోకపోవడంతో నాలుగు నెలలుగా పోలీస్ స్టేషన్ మెట్లు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అలసిపోతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. గతంలో అనేకసార్లు గ్రామానికి చెందిన పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరిగి తన తల్లిదండ్రులు చెల్లించిన లక్ష రూపాయలు తిరిగి ఇవ్వడమే గాక వారి పేరు మీద ఉన్న భూమిని వారికి రిజిస్ట్రేషన్ చేస్తానని ఒప్పుకొని ఇప్పుడు వారిని మోసం చేసాడని వాపోయారు. జాలితో ఎవరైనా నాలుగు మెతుకులు వేస్తే తిని కాలం వెళ్ళదీస్తున్నామని,ఎందరో అధికారులకు విన్నవించుకున్న, ఎన్ని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగిన తమకు న్యాయం జరగడంలేదని, తమకు కూడు పెట్టకుండా తాము సంపాదించుకున్న జాగాలోనే తమని ఉండనివ్వాలని ఆ వృద్ధ జంట వేడుకుంటుంది.

# డిఏవి స్కూల్‌లో ముస్లిం పిల్లలకు సీట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం

### సీట్లు కేటాయించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

### ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షులు ఎండి అలీ



**ప్రజాపక్షం / కాసిపేట:**కాసిపేట మండలంలోని దేవాపూర్ లో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిల్లీకి సంబంధించిన డిఎవి స్కూల్ లో స్థానిక ముస్లీంలకు అడ్మిషన్ సీట్లు ఇవ్వడం లేదని, కావాలనే సీట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఎంఐఎం పార్టీ కాసిపేట మండల అధ్యక్షులు ఎండి అలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ అలీ మాట్లాడుతూ దేవాపూర్లోని డిఎవి పాఠశాలను ఓరియంట్ కంపెనీ యాజమాన్యం డిల్లీ నుంచి తీసుకువచ్చి ఇక్కడ పెట్టిందని, స్థానికులకు మాత్రం సీట్లు ఇవ్వడం లేదు. ముస్లీం పిల్లలకు అసలు సీట్లు ఇవ్వకుండా కావాలనే ఈ విధానాన్ని అవలంభిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కాకుండా డిల్లీ నుంచి ఆదేశాలని ఇక్కడి విధానాలు అవసరం లేకుండా పాఠశాల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్నారన్నారు. ముస్లీంలను అసలు దగ్గరికి కూడా రానివ్వడం లేదని, కావాలనే ముస్లీం పిల్లలను సీట్లు ఇవ్వడం లేదన్నారు. సీట్ల కోసం అడిగితే డిల్లీతోనే సంబంధమని, ఇక్కడ దాట వేస్తున్నారని, గల్లీలో స్కూల్లో నడుపుతూ డిల్లీ పేరు చెప్తున్నారని, ముస్లీం మైనార్టీలకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. ముస్లీం పిల్లలు పుట్టింది, పెరిగింది దేవాపూర్లోనేనని, మా సమస్యను పరిష్కరించాలని, మా ముస్లీం పిల్లలకు సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని, కలెక్టర్ను కోరారు. లేకుంటే ఎంఐఎం పార్టీ తరుపున జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె. జహీర్, సలహాదారులు ఖైరత్ హుస్సేన్, షేక్. సాబీర్, షేక్ రఫీక్, ఎంఐఎం పార్టీ కాసిపేట మండల అధ్యక్షుడు ఎండి అలీ, ఎస్ కే జహీర్ అహ్మద్, ఎస్‌కె జాహిర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## పాన్ కార్డుతో ఆధార్ కార్డ్‌ను అనుసంధానం చేసుకోవాలి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :**ఇన్‌కం టాక్స్ డిపార్ట్మెంట్ నిబంధనల ప్రకారం ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులు పాన్ కార్డుతో వారి ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని డిజిఎం పర్సనల్ పి అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు శ్రీరాంపూర్ లో సుమారు 700 మంది ఉద్యోగులు తమ యొక్క పాస్ కార్డుతో ఆధార్ కార్డును అనుసందానం చేసుకోలేదని తెలిపారు. ఉద్యోగులు అనుసందానం చేసుకోనట్లయితే ఆదాయ పన్ను శాఖ వారు విధించే జరిమానాలకు బాధ్యులు కావలసి ఉంటుందని పేర్కొన్నారు. వారి యొక్క జీతం నుండి 20శాతం జరిమాన రూపంలో అనుసందానం చేసుకునేంత వరకు ఇన్‌కం టాక్స్ శాఖ వసూలు చేస్తుందని అన్నారు. కావున ఇప్పటి వరకు అనుసందానం చేసుకోని వారు వెంటనే తమ పాన్ కార్డ్ తో ఆధార్ కార్డును అనుసందానం చేసుకోవాల్సిందిగా కోరారు.

## చలో సిరిసిల్లను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/చందుర్తి:**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి వేడుకలు జులై 4న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అలనాడు నైజాం నిరంకుషత్వ పాలనకు, పెత్తందారులు, జరిగిందారులు, జగిందార్లు దోపిడీకి వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి అంటూ సాగిన ఉద్యమంలో తుపాకీ తూటాలకు బలి అయిన బహుజన బిడ్డ దొడ్డి కొమరయ్య వర్ధంతి వేడుకలకు మండలంలో నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వెళ్లి విజయవంతం చేయాలని మండల కురుమ సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందుర్తి మండల కురుమ సంఘం అధ్యక్షులు ఏనుగుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ఏనుగుల కనకయ్య, జడల శ్రీనివాస్ యాదవ్, బత్తుల కమలాకర్, తిప్పని శ్రీనివాస్ బొజ్జ కనకయ్య మ్యాకల పరశురాములు, వాసం మల్లేశం యాదవ్, మహేష్ యాదవ్, ఏనుగుల కృష్ణ, ఏనుగుల పరిసరాలు, తోత్తళ్ల పరశురాములు, మండల కురుమ నాయకులు పాల్గొన్నారు.

# సార్... మీరెళ్లొద్దు

### కన్నీళ్లు పెట్టిన విద్యార్థులు

### కలెక్టర్,డిఇఒలకు విన్నవించిన విద్యార్థుల తల్లిదండ్రులు



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** ప్రభుత్వ పాఠశాల ల్లో సమయానికి రాని ఉపాధ్యాయులు, సరిగా బోధించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఉపాధ్యాయులు, పాఠశబూలలకు రాని ఉపాధ్యాయుల గు రించి అందరూ మాట్లాడుకుంటారు. అయితే విద్యార్థులకు ఉన్నత విలులతో కూడిన బోధన చేయడమే కాకుం డా వారి వెన్ను తట్టి... సొంత బిడ్డల్లా ప్రేమగా చేసుకుంటూ వారికి కావల్సిన మౌలిక వసతులు కల్పిస్తున్న ఉపాధ్యాయులు ఉన్నారు. అందుకే ఇలాంటి ఉపాధ్యాయులను బదిలీ చేస్తే విద్యార్థుల బాధ వర్ణనాతీతం. వెళ్లకంటే సార్ అంటు ప్రధానోపాధ్యాయుని పట్టుకుని కన్నీ ళ్లు పెట్టుకున్న విద్యార్థుల ప్రేమ మాటల్లో చెప్పలేనిది. అలాంటి ఈ ఘటనే కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకెళ్తే... మండలంలోని ప్రాథమిక పాఠశాల చింతగూడ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మి నారాయణ వేరే పాఠశాలకు బదిలీ అయ్యారు. దాంతో ఉపాధ్యాయుడు లక్ష్మి నారాయణ పాఠశాల విడిచి వెళ్తుండగా.. వెళ్లొద్దు సార్... అంటు విద్యార్థులు, తల్లిదండ్రులు చుట్టుముట్టి కన్నీటి పర్యంతమయ్యారు. 12 సంవత్సరాలుగా విధులు నిర్వహించి ఎంతో మంది విద్యార్థులకు మంచి చదువును అందించి మంచి ప్రతిభ చాటేలా తయారు చేయడమే కాకుండా గురుకుల, నవోదయల్లో సీట్లు సైతం పొందేందుకు కృషిచేశారని అన్నారు. ప్రైవేటు పాఠశాలలో చదివించే స్తోమత లేక మీపై నమ్మకంతో మా పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించాము మీరే వెళ్తే మా పిల్లల భవిష్యత్తు ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు మనోవేదకు గురయ్యారు. మా సార్‌ని బదిలీ చేయొద్దంటూ జిల్లా కలెక్టర్, విద్యాధికారిలకు విన్నవించుకున్నారు.

# ఎంఎల్‌ఏ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆసిఫాబాద్ ఎంఎల్‌ఏ కోవా లక్ష్మి బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో డిసిసి అధ్యక్షుడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేసిన ఆత్రం సుగుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడం ఎంఎల్‌ఏ నీచ రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. ఒక ఎంఎల్‌ఏ గా ఉండి కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని మండిపడ్డారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు సీతక్క వస్తే ఎంఎల్‌ఏ కోవలక్ష్మి స్వాగతించాల్సింది పోయి ప్రోటోకాల్ పాటించడం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలు కోరుకున్న ప్రజా ప్రభుత్వంపై పనికిమాలిన విమర్శలు చేస్తే ప్రజలు మిమ్మల్ని తరిమికొడతారని అన్నారు. ప్రొటోకల్ కొరకు రాజకీయం చేయడం సిగ్గుచేటని, ప్రజల అభివృద్ధిని అడ్డుకొవాలని చూస్తే ఖబర్దారని హెచ్చరించారు. గత పదేళ్ల పాలనలో కెసిఆర్ వద్ద ఎంఎల్‌ఏ నేర్చుకున్న భూతుల పాఠాలు కావచ్చని విమర్శించారు. ఎంఎల్‌ఏ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే విరమించుకుని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేనిపక్షంలో ఎంఎల్‌ఏ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసి నాయకులు విశ్వనాథ్, చరణ్, శ్యామ్, అనిల్ గౌడ్, జ్యోతి, రాజేంద్ర కుమారి, ఇంద్ర, కళావతి, శైలజ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## హిందువులను అవమానించే విధంగా మాట్లాడడం సిగ్గుచేటు

### రావుల రాంనాథ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ పట్టణం లోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ మాట్లాడుతూ పార్లమెంట్లో చర్చ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడిన తీరును హిందువులను పూర్తిగా అవమానపరచడమే కాకుండా దేశంలో ఉన్న మైనారిటీల మెప్పుకోసం దేశంలో ఉన్న 120 కోట్ల మంది హిదువులను హిందూ తీవ్రవాదులని హింస వాదులు అని రాహుల్ గాంధీ మనసులో ఉన్న హిందువులపై ద్వేషం బయటపడ్డది 1975లో ఎమర్జెన్సీ విధించి కాంగ్రెస్ పార్టీ దేశంలో హింసను ప్రేరేపించడం అదేవిధంగా 1984లో సిక్కులపై ఊచ కోత కోసి హింసను తీవ్రవాదాన్ని పెంచి పోషించిన కాంగ్రెస్ పార్టీ ఈ రోజు దేశంలో హింస గురించి మాట్లాడటం సిగ్గుచేటు హిందువులు అంటే కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి కోపం ద్వేషం అదేవిధంగా ప్రతిపక్ష హోదాను ప్రజలు రాహుల్ గాంధీకి అవకాశం ఇస్తే దాన్ని ప్రజా సమస్యల మీద మాట్లాడి ప్రభుత్వ దృష్టికి తీసుకురాకుండా వాటని పక్కకు పెట్టి హిందువులను అవమానపరచడం తీవ్రంగా ఖండిస్తున్నాను వెంటనే రాహుల్ గాంధీ బేసరత్తుగా యావత్ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని లేకుంటే రానున్న రోజుల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదని కాంగ్రెస్ పార్టీని బిజెపి హెచ్చరిస్తున్నాం.

## లక్ష్యే లక్ష్యంగా కార్మికులు పనిచేయాలి

**ప్రజాపక్షం/మంథని:**ఆర్టీసీ సంస్థ ప్రవేశపెట్టిన లక్ష్యే లక్ష్యంలో బాగంగా మంగళవారం పెద్దపల్లి జిల్లా మంథని ఆర్టీసీ డిపో ఆవరణలో కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. మంథని ఆర్టీఓ డిపోలో రోజుకు లక్ష రూపాయల ఆదాయమే లక్ష్యంగా కార్మికులు పని చేయాలంటూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ ప్రయోజనాల పట్ల అవగాహక కల్పించారు. మంథని డిపోలో రోజుకు ఒక లక్ష రూపాయల ఆదాయం లక్ష్యంగా కార్మికులు పనిచేయాలని, కార్మికుల సంక్షేమమే సంస్థ ధ్యేయమని డిపో మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో ఇంచార్జి మేనేజర్ నాగభూషణం,అసిస్టెంట్ మేనేజర్ ఏంజెల్, డెప్యూటీ సూపరిండెంట్ ప్రసన్న కుమార్, ఎల్ హెచ్ శ్రీనివాస్, హెడ్ గార్డ్ వెంకటేశ్వర్లు, ఎస్టీఐ గోపాల్‌తో పాటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి: ఎస్ఎఫ్ఎస్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రోజు ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించక ముందే పోలీసులు 30 యాక్ట్ పేరుతో ముందస్తు అక్రమంగా అరెస్టు చేయడం జరిగింది.ఇందూర్ విభాగ్ ఎస్.ఎఫ్.ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలుగావస్తున్న ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదు.మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి 11వేల ఉద్యోగాలు వేయడం సిగ్గుచేటు,గ్రూప్ వన్ ప్రిలిమ్స్ 1:100 అభ్యర్థులను శాసిస్ట్ చేస్తామని చెప్పి,అదేవిధంగా జాబ్ క్యాలెండర్ ను ఏర్పాటు చేస్తామని మాయమాటలు చెప్పి నిరుద్యోగులను మోసం చేస్తున్నారు.గ్రూప్2,గ్రూప్3 పోస్టులను పెంచాలని,రెండు లక్షల ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.లేనియోడల రానున్న రోజుల్లో ఇవి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెపి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఖాళీగా ఉన్న 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ని వెంటనే ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దినేస్,జిల్లా ఎస్.ఎఫ్.ఎస్ కన్వీనర్ దుర్గాప్రసాద్,లక్ష్మ ణ్,సన్నీ,సాయి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/సోన్:** మండలంలోని మాదాపూర్ ఎక్స్ రోడ్డు జాతీయ రహదారి ఎన్.హెచ్ 44 నుండి వయా పాక్పట్ల నుండి గాంధీనగర్ వరకు రూ.14 కోట్ల నిధులతో రెండు వరుసల రోడ్డు పనులకు శంఖుస్థాపన చేసిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కేంద్రం నుంచి అనేక నిధులు వస్తున్నాయని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,ఎంపీపీ మానస హరీష్ రెడ్డి,నాయకులు సరికేల గంగన్న,మారగంగారెడ్డి తో పాలు తదితరులు పాల్గొన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డిమండలంలోని మాదాపూర్ గ్రామంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఫోటో 02 నిర్మల్ 11

## కుంటాల పిహెచ్‌సిలో ఊడి పడిన టైల్స్

**ప్రజాపక్షం/కుంటాల:**మండల కేంద్రంలో గల ప్రధమిక ఆరోగ్య కేంద్రంలో పనుల్లో నాణ్యత లోపం సిబ్బంది కి శాపంగా మారింది.అధికారుల పర్యవేక్షణ కరువై ఇష్టరీతిన పనులు చేపట్టడంతో వైద్య సిబ్బంది కి దిన దిన గండంగా మారింది.మంగళవారం హాస్పిటల్‌ల్లో పనిచేస్తున్న కాంటాక్ట్ వర్కర్ మిరియాల రవీందర్ ఆసుపత్రిలో పని చేస్తుండగా ఒక్కసారిగా గోడ పై నుండి టైల్స్ ఊడి తల పై పడ్డాయి.దింతో తలకు తీవ్ర గాయాలు పాలైన రవిని చికిత్స కోసం 108 లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.హాస్పిటల్ మరమ్మతులు నాణ్యత లోపంలో చేపట్టడంతో వర్షపు నీరు గదుల్లోకి వస్తుందని,విలువైన మందులు తడిసి పోతున్నాయని,అంటున్నారు.స్లాబు పెచ్చులు ఊడి పైన పడుతున్నాయి.సంబంధిత జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి కుంటాల పీ.హెచ్.సీలో నాసిరకం పనులు చేపట్టి,బిల్లులు పొందిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.సిబ్బందికి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కెటిఆర్... అహంకారపు మాటలు ఇకనైనా మానుకో

## ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం / ధర్మపురి :** 10ఏళ్ల బిఆర్ఎస్ రాచరికపు పాలనకు, నియంత పోకడలకు విసుగు చెంది తెలంగాణ ప్రజలు మొన్నటి ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పి గద్దె దించినప్పటికి కేసిఆర్‌కు, కేటిఆర్‌ల అహంకారపు పోకడలు తగ్గలేదని, ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లే మాటలకు స్వస్తి చెప్పాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హితవు పలికారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అడ్లూరి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం పేరిట జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేటిఆర్ జగిత్యాల ఎమ్మెల్యేపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడిన భాష దారుణమన్నారు. 10 ఏళ్ల బిఆర్ఎస్ నియంత పాలనలో కేసిఆర్, కేటిఆర్, హరీష్ రావు, కవిత అన్ని తామై అహంకార పూరితంగా ఇష్టానుసారంగా పాలన జరిపి రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని అన్నారు. నియంతృత్వ పోకడలో మంత్రులకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని అడ్లూరి అన్నారు. ఇవన్నీ గుర్తించిన ప్రజల కు మొన్నటి అసెంబ్లీ ఎన్నికలు, అనంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పారని అయినప్పటికి కేసిఆర్, కేటిఆర్‌లు ఆత్మ విమర్శ చేసుకోకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తుండటం వింతగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే లను భయపెట్టి గులాబీ కండువాలు కప్పిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం నచ్చి స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని దీనిని సైతం విమర్శిస్తున్న కేటీఆర్ మాటలు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ప్రణాళికా బద్ధంగా రాబోయే ఎన్నికలకు రెఫరెండంగా ఉంటుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ పార్టీకి కర్రకాల్చి వాత పెట్టేందుకు తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలలో4 ఇప్పటికే అమలు చేశామని ఆగస్టు15 లోపు ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారని తెలిపారు.10 ఏళ్ల కేసీఆర్ పాలనలో అన్ని రంగాలను నిర్వీర్యం చేసి మాటల యుద్ధానికి తెరలేపుతున్న తండ్రీ కొడుకులు ఒళ్ళు,నాలుక అదుపులో పెట్టుకోవాలని హితవు చెప్పారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రి గా వుండి ప్రజలకిచ్చిన హామీలను ఎలా దాటవేశాడో వీడియో రూపంలో అడ్లూరి సమావేశంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సంగనబట్ల దినేష్, వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్, సింహరాజు ప్రసాద్, జక్కు రవీందర్, జె. సుముఖ్, అప్పం తిరుపతి, వొజ్జల లక్ష్మణ్, గాజు సాగర్, అప్పం శ్రవణ్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట రైతుల రిలే నిరాహార దీక్ష



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మంగళవారం రోజున రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.గతంలో లోకేశ్వరం మండలంలోని పుష్పూర్ గ్రామపంచాయతీలోని నరసింహ నగర్ తండాకు చెందిన మోతిరామ్ అనే రైతు ఎకరం 20 గుంటల భూమిని ప్రభుత్వం తీసుకొని క్రీడా ప్రాంగణం నిర్మించారు.అప్పటి నుంచి కలెక్టరేట్లో ఎన్ని సార్లు ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోవడంలేదని తన భూమి ఇప్పించాలని కోరారు.

## డ్రైడే కార్యక్రమంపై స్పెషల్ ఫోకస్



**ప్రజాపక్షం/నర్సాపూర్(జి):** నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలంలో డ్రై డే కార్యక్రమం పై మండల అభివృద్ధి అధికారిణి పుష్పలత స్పెషల్ ఫోకస్ పెట్టారు.మండల పరిషత్ పరిధిలో ఉన్న అధికారులకు టీమ్స్ గా ఏర్పాటుచేసి ఈ కార్యక్రమాన్ని 13 గ్రామపంచాయతీలో పగడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు.వర్షాల కారణంగా గ్రామాల్లో అక్కడక్కడ ఏర్పడ్డ మురికి గుంతలలో నిల్ల ఉన్న నీటి పై దోమల అధికమవడానికి వీలుంటుందని దోమలను నివారించేందుకు మురికి గుంటలలో ఆయిల్ బాల్స్ వేసి ఉంచాలి. అంతేగాక అక్కడక్కడ ఇంటి పరిసర ప్రాంతాలలో వర్షపు నీరు డబ్బాలలో నిల్వ ఉండి,ఉంటే వాటిని ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రతను పాటించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.గ్రామ ప్రజల సహకారంతో ప్రతి ఇంటింటికి పంచాయతీ కార్యదర్శితో పాటు ఆశ వర్కర్,అంగన్వాడీ ఆ యా ,ఫీల్డ్ అసిస్టెంట్ ఐకెపి సిబ్బందితో పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించామని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు.

# సింగూరు జలాలను విడుదల చేయాలి

## మండల కాంగ్రెస్ నాయకుడు ప్రజాపండరి



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టుకు వెంటనే సింగూరు జలాలను విడుదల చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాపండరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద మంగళవారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నిజాంసాగర్‌లో ప్రస్థుతం 3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందని, గత 23వ తేదీనా నిజాంసాగర్ ఆయకట్టు రైతుల విజ్ఞప్తి మేరకు, ప్రభుత్వ ఆదేశానుసారం నీటిపారుదల శాఖమంత్రి, అధికారులు నిజాంసాగర్ నీటిని ప్రధాన కాలువ ద్వారా విడుదల చేశారని తెలిపారు. దీంతో ఆయకట్టు కింద రైతులు ఇప్పటి వరకు విడుదల చేసిన ఒక్క టీఎంసీల నీటితో 30 శాతమే రైతులు వరి నాట్లు వేసుకున్నారని, మరికొద్ది రోజుల వరకు ఒక టీఎంసీ నీటిని వదిలితే సుమారు 50 శాతం మాత్రమే పంటలు వేయడం జరుగుతుందని, ఆయకట్టు రైతుల అవసరాలకు అనుగుణంగా సింగూరు నుండి నీటిని విడుదల చేయాలని లేని యెడల రైతులతో కలిసి సింగూరు ప్రాజెక్టును ముట్టడిస్తామని ఆయన అన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ

**ప్రజాపక్షం/మంథని:** మంథని మున్సిపల్ పరిధిలోని చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయించాలని జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటి పరిధిలోని ఆయా వార్డుల్లో ఆమె విస్తృత పర్యటన చేశారు. శ్రీరాంనగర్‌లో చేపట్టిన పారిశుద్ధ్య నిర్వహణ పనులు, శ్రీపాదకాలనీలో నర్సరీ, బొక్కలవాగును ఆనుకున్న ఉన్న డ్రైనేజీ సిస్టమ్‌లను ఆమె మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమా సురేష్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మంథని మున్సిపాలిటీలో పలు అభివృద్ధిపనులు, నూతన మున్సిపాలిటీ భవన నిర్మాణం కోసం గంగాపురిలో స్థలం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంథని మున్సిపల్ అభివృద్ధితో తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గట్టు మల్లికార్జున స్వామి, వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్‌లు గుండా విజయలక్ష్మి పాపారావు, కుర్ర లింగయ్య, నక్క నాగేంద్ర శంకర్, కొట్టె పద్మ రమేష్‌తో పాటు మున్సిపల్ కార్యలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూరు గ్రామానికి చెందిన నల్ల లక్ష్మి (54) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నల్ల లక్ష్మి తన భర్త సంజీవరెడ్డి గత రెండు సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకోగా అప్పటినుండి లక్ష్మి మానసిక వేదనకు గురై, ఎవరితో మాట్లాడేది కాదు. తన భర్త గురించి ఆలోచిస్తూ ఎప్పుడూ బాధపడుతూ ఉండేది. ఇదిలా ఉండగా తేదీ 2962024 రోజున తన కుటుంబ సభ్యులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్ళగా ఇంట్లో ఎవరు లేని సమయంలో జీవితంపై విరక్తి చెందిన నల్ల లక్ష్మి ఏదో గుర్తుతెలియని పురుగుల మందు తాగి వాంతి చేసుకుంటుండగా, గమనించిన నల్ల రాజశేఖర్ రెడ్డి వెంటనే మెట్పల్లిలోని గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించారు. డాక్టర్ చూసి పరిస్థితి విషమంగా ఉందని నిజామాబాదు హాస్పిటల్ కు తీసుకువెళ్ళమని చెప్పడంతో, నిజామాబాద్ లోని హోప్ హాస్పిటల్ లో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం రోజున రాత్రి అందాజా 9:30 గంటల సమయంలో చనిపోయిందని వైద్యులు తెలిపారు. మృతురాలి కొడుకు నల్ల రాజశేఖర్ రెడ్డి పిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## లైవ్ జిల్లా అధ్యక్షుడి నియామకం

**ప్రజాపక్షం/నేరడిగొండ:** గిరిజన లంబాడీల ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగ మహేందర్ జాదవ్‌ను నియమించినట్లు(లైవ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ తెలిపారు. జాదవ్ మహేందర్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టడం తో మరింత బాధ్యత పెరిగిందని వారి సమ్మకాన్ని వమ్ము చేయకుండా. గిరిజన లంబాడీల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్,స్టేట్ చీఫ్ కో ఆర్డినేటర్ జాదవ్ రమేష్ నాయక్ కి ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు పరామర్శ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** సతీమణి మరణంతో విషాదంలో ఉన్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబాన్ని రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, జయశంకర్ భూపాల పల్లి జడ్పీ చైర్ పర్సన్లు న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, దావా వసంత సురేష్, జక్కు హోరిని రాకేష్ పరామర్శించారు. అల్వాల్ లోని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాసానికి వెళ్ళి రూపదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.

## వృద్ధులకు, వికలాంగులకు ఉచిత వ్యాన్ సేవ



**ప్రజాపక్షం / గొల్లపల్లి :** పేరుకు కోటీశ్వరులైన.. సహాయం చేసే స్తోమత కలిగిన వారైనా.. కనీసం రూపాయి కూడా సహాయం చేయడానికి చాలామంది జంకుతూ ఉంటారు. అలాంటి వారికి కనువిప్పు కలిగేలా చేస్తున్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో బాదినేని మల్లారెడ్డి సేవా దృక్పథంతో లక్ష్మీపూర్, పరిసర ప్రాంత వృద్ధులకు, వికలాంగులకు మరియు గర్భిణీ స్త్రీల ఆరోగ్య అవసరాల నిమిత్తం హాస్పిటల్ కు వెళ్లడానికి లక్ష్మీపూర్ నుండి జగిత్యాలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందుల లావణ్య జలపతి, కట్ట శివ, మల్లారెడ్డి, రాజిరెడ్డి, ఆశినేని లక్ష్మణ్, బలిజపల్లి శంకరయ్య, తిరుపతి, మందపల్లి లక్ష్మణ్, ఎనగందుల మల్లయ్య, లచ్చన్న, రంగ మల్లేశం, సతీష్, శేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో డాక్టర్లకు ఘనంగా సన్మానం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** డాక్టర్స్ డే సందర్భంగా నిర్మల్ పట్టణంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణం రాజు,డాక్టర్ గోపాల కృష్ణ, శిశువైద్యులు డాక్టర్ సంతోష్,ప్రసూతి వైద్యులు డాక్టర్ స్వర్ణ రెడ్డి, డాక్టర్ విద్యులత,డాక్టర్ చంద్రిక,డాక్టర్ సరిత లను ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యం కేక్ కట్ చేయించి పూలమాల,శాల్వలతో ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు అన్సర్ పాషా,ఉపాధ్యక్షులు శోభా రాణి,ప్రధాన కార్యదర్శి తుమ్మల దేవరావ్,సహాయ కార్యదర్శులు హరి కృష్ణ,మూరాద్ ఆఫ్రొజ్,ఇతర సభ్యులు పాల్గొన్నారు.

**రోగులకు పండ్లు పంపిణీ:** ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు అన్సర్ పాషా,ఈ సందర్భంగా నిర్మల్ పట్టణంలో డాక్టర్లతో ఒక ప్రత్యేక కార్యక్రమంలో శాల్వతలో సన్మనించారు..ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణి చేశారు.

## ఆర్టీసి బస్సును అడ్డుకున్న గ్రామస్తులు

**ప్రజాపక్షం/మామడ:** మండలంలోని కమల్కోట్ గ్రామానికి వెళ్లిన ఆర్టీసీ బస్సును మంగళవారం పొన్కల్ గ్రామస్తులు అడ్డుకున్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..నిత్యం గ్రామాలకు వచ్చే బస్సులో వందకు పైగా విద్యార్థులతో పాటు వివిధ గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుండడంతో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు.ప్రమాదం సంభవించక ముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# గందరగోళంగా జెడ్పి సర్వసభ్య సమావేశం

పోడియం ఎదుట సభ్యులతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నిరసన

డీఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్

ఎమ్మెల్యే పాడికౌశిక్, జడ్పీటిసి రవీందర్ మద్య వాగ్వివాదం

జిల్లాపరిషత్ సమావేశంలో రసాబాస



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**కరీంనగర్ జిల్లా పరిషత్ 23వ సర్వసభ్య సమావేశం గందరగోళంగా మారింది. జడ్పి సమావేశానికి వీడ్కోలు జరిగే ఆఖరి సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు బిఆర్ఎస్ జడ్పిటిసిలు, ఎంపిపిల నిరసనలు.. కాంగ్రెస్ జడ్పిటిసిలు, ఎంపిపిల మద్య వాగ్వివాదాలు చోటు చేసుకోవడంతో సమావేశం పూర్తిగా రసాభాసగా మారింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జడ్పి సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ అధ్యక్షత వహించారు. సమావేశంలో వివిధ అంశాలపై సభ్యులు చర్చించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గంలోని రెండు ప్రధాన ఆసుపత్రుల్లో కెసిఆర్ కిట్లు ఇవ్వడం లేదని, దీంతో డెలివరీలు గణనీయంగా తగ్గిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి పేరు మార్చుకున్నా మంచిదే కానీ పథకాన్ని అమలు చేసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి అయ్యేవారిని ప్రోత్సహించాలని సూచించారు. హుజురాబాద్ ఆసుపత్రిలో సిద్ధంగా ఉన్న ఐసియూ సేవలను వినియోగంలోకి తీసుకురావాలని, గత ప్రభుత్వ హయాంలోనే దీనిని సిద్ధం చేశారన్నారు. డాక్టర్ల కొరత కూడా తీవ్రంగా ఉన్నందున డెలివరీల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, వెంటనే హుజురాబాద్, జమ్మికుంట ఆసుపత్రుల్లో డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ నియోజకవర్గ స్థాయిలో అధికారులతో సమీక్షిస్తే హాజరైన ఎంఈవోలను సస్పెండ్ చేస్తామంటూ మెమోలు జారీ చేయడంపై డీఈవో వైఖరిని తప్పు పట్టారు. వెంటనే డీఈవోను సస్పెండ్ చేయాలంటూ ప్లకార్డులతో జడ్పి పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. డీఈవోను వెంటనే సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. సముదాయించేందుకు ప్రయత్నించిన కలెక్టర్‌తో అదే స్థాయిలో మాట్లాడారు.ఆమె జడ్పి సమావేశ మందిరం నుంచి వెళ్లిపోయారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ జడ్పి ఫ్లోర్ లీడర్, చిగురుమామిడి జడ్పిటిసి గీకరు రవీందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో జడ్పి చైర్మన్ కనుమల్ల విజయ పోలీసులతో మాట్లాడి జడ్పిటిసి శ్రీరాం శ్యాంను లోనికి అనుమతించారు. అనంతరం జడ్పి చైర్మన్, హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో విద్యా సమస్యలపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయులకు మెమోలు జారీ చేసినందుకు గాను కరీంనగర్ డీఈవోను సస్పెండ్ చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణించి ఆమోదించినట్లు జడ్పి చైర్మన్ కనుమల్ల విజయ తెలిపారు.

# ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై సత్వరమే స్పందించాలి

జాతీయ ఎస్సీ కమిషనర్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పోలీసులు సత్వరమే స్పందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ ఆదేశించారు. బాధితులకు అండగా నిలవాలని సూచించారు. మంగళవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి , పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి, ఎన్‌సిఎస్సీ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, రీసర్చ్ ఆఫీసర్ డి వరప్రసాద్‌తో కలిసి జాతీయ కమిషన్ సభ్యుడు రామచందర్ జిల్లాలో ఎస్సీల సంక్షేమం, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఒక్కొక్క శాఖ వారీగా సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా రామచందర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు పోలీసులు అండగా నిలిచి న్యాయం చేయాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో బ్యాక్‌లాగ్ పోస్టుల వివరాలు, పదోన్నతులకు సంబంధించిన వివరాలు 15 రోజుల్లోగా అందించాలని ఆదేశించారు. నిరుపేదల ఆర్థిక అభివృద్ధి కోసం బ్యాంకర్లు చేయూత అందించేందుకు రుణాలందించాలని పేర్కొన్నారు. వారికి ఇబ్బందులు కలిగించొద్దని, పేదలకు సేవ చేస్తే భగవంతునికి చేసినట్లేనని, ఆ సంకల్పంతో అధికారులు పనిచేయాలని సూచించారు. అసైన్డ్ భూములకు చట్టబద్దత కల్పించి పాస్ బుక్కులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లైంగిక దాడులు, హత్యకు గురైన బాధిత కుటుంబాలకు సత్వరమే న్యాయం జరగడంతో పాటు వారికి పరిహారం అందించాలని ఆదేశించారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో గుడుంబా విక్రయాలను పూర్తిగా నియంత్రించాలని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్, డిఆర్‌వో పవన్ కుమార్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేష్ బాబు, సిపిఓ కొమురయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుల్లో స్థానిక సంస్థలకు మరింత ప్రాధాన్యం

పార్టీలకతీతంగా సమస్యల పరిష్కారం

రాష్ట్ర రవాణా, బీసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** పార్టీలకతీతంగా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పదవీ బాధ్యతలు పూర్తి చేసుకున్న జడ్పి చైర్మన్, జడ్పిటిసిలు, ఎంపిపిలు, జడ్పికో ఆప్షన్ మెంబర్లకు కరీంనగర్‌లోని జడ్పి కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఐదు సంవత్సరాల ప్రజాజీవితంలో నిధులు ఉన్నా లేకున్నా అనేక కష్టాలు వచ్చినా, ప్రజా సమస్యలు పరిష్కరించి ఎంపిపిలు, జడ్పిటిసిలు మంచి పేరు సంపాదించారని పేర్కొన్నారు. ఎంపిపిలు, జడ్పిటిసిల పదవీకాలం ముగిసినా ప్రజా జీవితంలో ఏదో పదవిలో ఎన్నికై ప్రజలకు సేవలందిస్తారని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా సహృద్భావ వాతావరణంలో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు సాధించే అవకాశం ఉందని చెప్పారు. సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. కరీంనగర్ జడ్పి చైర్మన్‌గా తన రాజకీయ గురువు జువ్వాడి జొక్కారావు పనిచేశారని, తర్వాత అనేక మంది పనిచేశారని తెలిపారు. జడ్పి చైర్మన్ కనుమల్ల విజయ గణపతి, వైస్ చైర్మన్ పేరాల గోపాల్ రావు, జడ్పిటిసిలు, ఎంపిపిలు, జడ్పికో ఆప్షన్ స భ్యులను మంత్రి ఘనంగా సన్మానించారు. అంతకు ముందు జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హాజరయ్యారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, జడ్పి సీఈవో శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, అధికారులున్నారు.

## బదిలీ అయిన టీచర్లను వెంటనే రిలీవ్ చేయండి:ఎస్‌టియు

**ప్రజాపక్షం/కరీంనగర్:** సుదీర్ఘకాలం బదిలీల కోసం వేచి చూసి ప్రస్తుతం తాము పనిచేస్తున్న ప్రదేశం నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్‌టియు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఆర్ శ్రీనివాస్, కట్ట రవీంద్రచారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంతర్గత రేషనలైజేషన్‌లో ఎస్‌జిటి ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లిందని వారు చెప్పారు. రేషనలైజేషన్ ద్వారా బదిలీలు నిర్వహించినప్పటికీ తిరిగి విద్యార్థుల సంఖ్య, రిలీవర్ పేరుతో వారు బదిలీ అయిన స్థానంలో చేరకుండా నిలువరించడం సమంజసం కాదన్నారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తగినంత మంది విద్యావాలంటీర్లను నియమించి బదిలీ అయిన టీచర్లను సత్వరం రిలీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. డిఎస్సీ ప్రక్రియను వేగవంతం చేసి పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు లేకుండా చేయాలని కోరారు. ఒక వైపు జీరో పాఠశాలలు తెరిచే ప్రయత్నం చేస్తూ మరో వైపు ఉపాధ్యాయుల సంఖ్యను కుదిస్తూ జరిపిన రేషనలైజేషన్ విధానాన్ని వారు ఖండించారు. .

## ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణం లోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు నుకొన్ని పాఠశాలల్లో వేయడం లేదని వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకుని కోడిగుడ్డును అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. కొన్ని పాఠశాల భవనాలు శిలావస్థకు చేరుకున్నాయని వాటికి నూతన భవనాలు నిర్మించాలని అన్నారు. మంచి నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో ఫిల్టర్ వాటర్ ఏర్పాటు చేయాలని పాఠశాలలో అటెండర్, పీటీ టిచర్ పోస్టులు భర్తీ చేయాలని పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వం చేపట్టిన మన ఊరు.. మన బడి.. పథకం ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రతి పాఠశాలలో ఈ పథకం వర్తించేలా ప్రభుత్వ చుడాలని వెంకటేష్ కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, మండల అధ్యక్షకార్యదర్శులు దొమ్మాటి వేణుగోపాల్, జూపాక శివమణి, మండల సహాయ కార్యదర్శి రాపెల్లి రోహిత్, నాయకులు సందీప్, రాకేష్ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటం

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/శంకరపట్నం:**మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రజాసంఘాల ఆద్వర్యంలో పోరాటం చేస్తామని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో గ్రామగ్రామాన మాదక ద్రవ్యాలతో యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, గత కొద్ది రోజులుగా చాలా మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారని, చదువులు మానేసి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖ అధికారులు, పోలీసుల సహకారంతో యువజన సంఘాలను, మహిళా సంఘాల ప్రతినిధులతో ప్రజాప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొంగోని అభిలాష్, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్, టిడిపి నాయకులు ఆరిఫ్, నాయకులు చల్లూరి రాజేందర్, కోడూరి మహేష్, సామల హరీష్ తదితరులున్నారు.

వార్తకు ఫోటో ఉంది

## అడ్మిషన్లు నిరాకరిస్తున్న చొప్పదండి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండి పట్టణంలో ఉన్న సమీకృత షెడ్యూల్డు కులాల సంక్షేమ హాస్టల్‌కు చెందిన ఎస్సి విధ్యార్థులకు ప్రవేశాలు నిరాకరిస్తూ బడిలో చేర్చుకోని చొప్పదండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎంపిటిసి ఫోరం అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విధ్యాశాఖాధికారి కార్యాలయంలో కొలిమికుంట ఎంపిటిసి తోట కోటేశ్, ఆర్నకొండ ఎంపిటిసి గొల్ల సునంద గట్టయ్య తదితర బిజెపి నాయకులతో కలిసి జిల్లా విద్యాశాక కార్యాలయ సూపరిండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చొప్పదండి బాలుర ఉన్నత పాఠశల ప్రిన్సిపాల్ విధ్యార్థులకు అడ్మిషన్లు ఎందుకు నిరాకరిస్తున్నారో జిల్లా విధ్యాశాఖాధికారి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిసూ్త పాఠశాల ప్రిన్సాపల్ నిరుపేద దళిత విధ్యార్థులకు ప్రవేశాలు నిరాకరిస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం చోద్యం చూస్తుందని నిప్పులు చెరిగారు. ప్రిన్సిపాల్ వైఖరితో నిరుపేద దళిత విధ్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందని, జిల్లా విధ్యాశాఖాధికారి తక్షణం స్పందించి సమీకృత సంక్షేమ హాస్టల్ విధ్యార్థులు ప్రవేశాలు ఇప్పించాలని, విద్యాహక్కు చట్టంను ఉల్లంఘిస్తున్న ప్రిన్సిపాల్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి యువమోర్చా అధ్యక్షుడు మొగిలి మహేష్, మాజీ మండల శాఖ అధ్యక్షుడు సింగిరెడ్డి భూమిరెడ్డి, గుండె వెంకటేష్, మ్యాకల రాములు, గసికంటి రవి తదితరులున్నారు.